గంజాయి పట్టివేత.. ఒకరి అరెస్ట్

కాజీపేట, అక్టోబర్ 26 : కాజీపేటలో అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని పోలీసులు తనిఖీ చేసి గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించిన ఘటన శనివారం జరిగింది. కాజీపేట ఎస్సై లవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బాబు క్యాంపు పోచమ్మగుడి వద్ద ప్లాస్టిక్ కవర్‌తో శుక్రవారం సాయంత్రం అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తి పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. కాశీబుగ్గ, లేబర్ కాలనీకి చెందిన సదరు వ్యక్తి గణేశ్ తన తల్లిదండ్రులు చనిపోవడంతో ఒంటరిగా ఉంటూ కూలీ పని చేసుకుంటున్నాడు. కాశీబుగ్గ, అండర్ బ్రిడ్జికి చెందిన కూలీలతో పరిచయం ఏర్పడగా, నాలుగు ఏళ్ల నుంచి గంజాయి తాగడం అలవాటైంది. వీరంతా బల్లార్షా నుంచి గంజాయి తీసుకువచ్చి ఇక్కడ అమ్మేవారు. ఈ క్రమంలో గణేశ్ బల్లార్షాకు ఐదు రోజుల క్రితం వెళ్లి గుర్తు తెలియని వ్యక్తుల వద్ద 230 గ్రాముల గంజాయి కొనుగోలు చేసి పోచమ్మ గుడి వద్ద అమ్మేందుకు రాగా, పట్టుకున్నామన్నారు. గంజాయి విలువ రూ.5750 ఉంటుందన్నారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

గంజాయితో పట్టుబడిన మరొకరిపై కేసు..

వేలేరు : గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్, వేలేరు పోలీసులకు హుజూరాబాద్ మారుతీనగర్‌కు చెందిన మాటూరి తరుణ్ (20) వేలేరు బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా కన్పించాడు. యువకుడిని పట్టుకుని తనిఖీ చేయగా సూమారు 410గ్రాముల గంజాయి దొరికింది. దీని విలువ సుమారు రూ.11,250 ఉంటుందన్నారు. యువకుడి వద్ద రూ.8,900 నగదు, సెల్‌ఫోన్ సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

'రాజకీయాలను కలుషితం చేస్తున్న బీజేపీ'

శాయంపేట, అక్టోబర్ 26 : దేశంలోని స్వతంత్ర వ్యవస్థలైన ఎన్నికల కమిషన్, న్యాయ వ్యవస్థలను తన గుప్పిట్లో పెట్టుకుని రాజకీయాలను కేంద్రంలోని బీజేపీ సర్కారు కలుషితం చేస్తున్నదని ఎంసీపీఐయూ కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి అన్నారు. మాజీ ఎమ్మెల్యే, ఎంసీపీఐయూ వ్యవస్థాపకుడు ఓంకార్ 16వ వర్ధంతిని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శాయంపేటలో శనివారం నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగం, ఆత్మహత్యలు, అత్యాచారాలు, హింసతో పాటు కుల, మత బేధాలు, ప్రాంతీయ తత్వాలను పాలక వర్గాలు అనైతిక రాజకీయ విధానాలతో పెంచి పోషిస్తున్నాయన్నారు. సెక్యులర్ పేరుతో కాంగ్రెస్ దేశాన్ని సుదీర్ఘ కాలం పాలించి ఆర్థిక దోపిడీతో పాటు కులమత తత్వాలను పెంచి పోషించిందన్నారు. బీజేపీ దేశ సంపదను అదానీ, అంబానీకి కట్టబెట్టిందన్నారు. మతోన్మాదం, పెట్టుబడుదారి ఆర్థిక విధానాలను ప్రశ్నించిన వారిపై చర్యలకు పూనుకుంటుందని విమర్శించారు. జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసారెడ్డి, డివిజన్ కార్యదర్శి రవీందర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సావిత్రి పాల్గొన్నారు.

సిద్ధేశ్వరుడిని దర్శించుకున్న నందీశ్వరుడు

హనుమకొండ, అక్టోబర్ 26 : హనుమకొండ పద్మాక్షికాలనీలోని చారిత్రాత్మక సిద్ధేశ్వరాలయంలోకి నందీశ్వరుడు వచ్చాడని అర్చకుడు సిద్ధేశుని సురేశ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆలయంలోని గర్భగుడిలోకి వచ్చిన నందీశ్వరుడు స్వామిని దర్శించుకొని కొబ్బరి ముక్కలు ఆరగించారన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు.

'శాస్త్ర సాంకేతిక రంగానికి గణితం గొప్ప వరం'

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 26 : శాస్త్ర సాంకేతిక రంగానికి గణితం గొప్ప వరమని రిజిస్ట్రార్ మల్లారెడ్డి అన్నారు. కేయూ గణిత విభాగాధిపతి భారవీశర్మ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. 'లీనియర్ ఆల్జీబ్రా, పాక్షిక అవకలన సమీకరణాలు' అనే అంశాలపై ప్రత్యేక చర్చ నిర్వహించారు. నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ వైఎన్ రెడ్డి, ప్రొఫెసర్ ఎస్ఎస్‌వీఎన్ శర్మ ప్రస్తుతం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, శాస్త్ర సాంకేతిక రంగానికి లీనియర్ ఆల్జీబ్రా, పాక్షిక అవకలన సమీకరణాలు ఎలా ఉపయోగపడుతాయో వివరించారు. యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్, సైన్స్ డీన్ హనుమంతు గణితం ఆవశ్యకత గురించి తెలియజేశారు. సెమినార్ కన్వీనర్ మాట్లాడుతూ.. పరిశోధకులు సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. కార్యక్రమంలో గణిత విభాగం ఆచార్యులు ఎల్పీ రాజ్‌కుమార్, తిరుమలాదేవి, సోమయ్య, సౌజన్య, నాగయ్య, రవికుమార్, శ్రీలక్ష్మి, మంజుల పాల్గొన్నారు.

నేడు పబ్లిక్‌గార్డెన్‌లో జానపద జాతర

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 26 : జేబీ కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ 25వ వార్షికోత్సవం సందర్భంగా వరంగల్ శంకర్, దీకొండ సారంగపాణి యాదిలో జానపద ఆట పాటల జాతర, కళాకారులకు వరంగల్ శంకర్ దీకొండ సారంగపాణి కీర్తి పురస్కారాలు అందించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడల శివ ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో 27న కార్యక్రమం నిర్వహిస్తున్నామని, సినీ గాయకుడు కాసర్ల శ్యామ్, సినీగేయ రచయిత వరంగల్ శ్రీనివాస్, అంతడుపుల నాగరాజు, భూక్యా సుశీల అతిథులుగా పాల్గొంటారని చెప్పారు.

బల్దియా అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి బదిలీ

వరంగల్, అక్టోబర్ 26 : గ్రేటర్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డిని బదిలీ చేస్తూ శనివారం రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి దాన కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో వర్ధన్నపేట స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ కమిషనర్‌గా పనిచేస్తున్న జోనాను నియమించారు. రాజేందర్‌రెడ్డిని సీడీఎంఎకు రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాజేందర్‌రెడ్డి జూలైలో గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ నుంచి వరంగల్‌కు బదిలీపై వచ్చారు.

బహిరంగ ప్రకటన

తేది.26-10-2024 శనివారం రోజున, ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ అయిన శ్రీరామోజ్ ప్రవీన్, తండ్రి కీ.శే. కుమారస్వామి, వృత్తి వ్యాపారం, నివాసం: ఇ.నెం. 3-5-15, సుధానగర్, హనుమకొండ జిల్లా గారికి మోతే వెంకటలక్ష్మి, భర్త వెంకటయ్య, నివాసం: ఇ.నెం. 3-7-299, కుమార్‌పల్లి, హనుమకొండ జిల్లా గారు స్వాధీనంలో ఉన్న ఆస్తిని వారి కుటుంబ అవసరాల నిమిత్తం అమ్మదల్చుకున్నారు. నా క్లయింట్ కొనదల్చుకున్నాడు. నా యొక్క క్లయింట్ కొనడానికి అగ్రిమెంట్ చేసుకున్నారు. ఇట్టి ఆస్తికి బయానాగా ఇచ్చినారు. మిగితా డబ్బులు రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చిన రోజున ఇస్తానని ఒప్పుకోవడం జరిగింది. సదరు మోతే వెంకటలక్ష్మి గారు ఇట్టి ఆస్తిని సేల్ డీడ్ నెం.156/1985, తేది.15-01-1985, ఎస్.ఆర్.ఓ., వరంగల్ (ఆర్.ఓ.) ద్వారా సంక్రమించినది. సదరు ఆస్తిపై ఎలాంటి లాకట్టులు, జప్తులు, రుణ భారములు లేవని నా క్లయింటును నమ్మించినారు. కావున ఈ ప్రకటన ద్వారా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిపై ఎవ్వరికైన ఏమైన అభ్యంతరములు, తనఖాలు, ఆక్షేపణలు, దావాలు ఉన్నచో వారం రోజులలో ఈ దిగువ అడ్వకేట్ అడ్రసుకు లిఖితపూర్వకంగా తెలియజేయగలరు. లేనిచో ఇట్టి ఆస్తిపై ఎటువంటి అభ్యంతరములు లేవని భావించవలసివచ్చును. పై గడువు తరువాత వచ్చు అభ్యంతరములు పరిగణలోకి తీసుకొనబడవు.

షెడ్యూలు ఆస్తి: హనుమకొండ పట్టణ పరిధిలోని కుమార్‌పల్లి ఇ.నెం. 3-7-299 (కొత్తది), ఇ.నెం. 3-7-109, 3/553 (పాతది) రెండు అంతస్తుల భవనం హనుమకొండ మున్సిపల్ పరిధిలోని రిజిస్ట్రేషన్: 142 చ.గ.లకు దీనికి హద్దులు, తూర్పు: పబ్బ చంద్రమౌళిగి గారి (2.6) దారి, పడమర: 30 ఫీట్ల రోడ్డు, ఉత్తరం: పబ్బ చంద్రమౌళిగి గారి ఇల్లు, దక్షిణం: 20 ఫీట్ల రోడ్డు, ఈ ప్రకటన శ్రీరామోజ్ ప్రవీన్. తండ్రి: కీ.శే. కుమారస్వామి గారి సూచనతో జరుస్తినది.

ఇట్లు **చౌడవరపు రాము** B.Com.,LL.M
న్యాయవాది, 2-6-286, హౌజింగ్ బోర్డు కాలనీ, హనుమకొండ జిల్లా, సెల్: 9440708371.

సియెర్రా ప్లాజా ప్రైవేట్ లిమిటెడ్
(ఏథర్ ఎనర్జీ లిమిటెడ్ యొక్క అధీకృత డీలర్)
(ఏథర్ స్పేస్-ఎలక్ట్రిక్ స్కూటర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్-వరంగల్)
సూట్ నెం.202, 2వ అంతస్తు, ట్రెండ్‌సెట్ టవర్స్, ఇ.నెం.8-2-269/10, రోడ్ నెం.2, బంజారాహిల్స్, హైదరాబాద్, తెలంగాణ-500034

బహిరంగ ప్రకటన
మోసం మరియు తప్పుడు సమాచారం పట్ల జాగ్రత్త వహించండి

మా విలువైన కస్టమర్లు, ఉద్యోగులు మరియు సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా సియెర్రా ప్లాజా ప్రైవేట్ లిమిటెడ్ ''సియెర్రా ప్లాజా'' మరియు ఏథర్ ఎలక్ట్రిక్ స్కూటర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్-వరంగల్ యొక్క సంబంధితులందరికీ ఇందుమూలంగా తెలియజేయునది మరియు వారి దృష్టికి తీసుకురావడమైనది ఏమనగా, కార్తిక్ వడిచెర్ల తండ్రి స్వర్గీయ వి.సత్యం, వయస్సు 33 సంవత్సరాలు, మాజీ-ఉద్యోగిపై సెక్షన్స్ 420, 403 మరియు 408 ఆఫ్ IPC క్రింద నేరాల నిమిత్తం FIR No.339 of 2023 ద్వారా కాజిపేట్ పోలీస్ స్టేషన్, వరంగల్ వద్ద ఫిర్యాదు దాఖలు చేయబడినది. CC No.2396/23లో చార్జ్‌షీట్ దాఖలు చేయబడినది మరియు గౌరవనీయ న్యాయస్థానం సదరు విషయాన్ని పరిగణలోకి తీసుకున్నది.

కార్తిక్ వడిచెర్ల, కంపెనీ యొక్క మాజీ ఉద్యోగి మాతో ఏవిధమైన హోదాలో సంబంధం కలిగి లేరని తెలియజేయడమైనది. మా అంతర్గత విచారణలో ప్రాథమికంగా కనుగొన్న విషయాలు మరియు లభ్యమైన డాక్యుమెంట్ల ఆధారంగా అతనిని తొలగించడం జరిగింది. అతను మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడినట్లు, కంపెనీ నిధులను దుర్వినియోగం చేసినట్లు మరియు తప్పుడుగా కస్టమర్ల నుండి అనధికారికంగా సొమ్మును వసూలు చేశాడని కనుగొనబడింది.

కార్తిక్ వడిచెర్ల తప్పుడుగా లాభం పొందడం లేదా కస్టమర్లను మోసం చేసే ఉద్దేశ్యంతో వరంగల్ సియెర్రా ప్లాజా యొక్క ఉద్యోగిగా తప్పుడుగా వ్యవహరిస్తూ కస్టమర్లను తప్పుదారి పట్టించవచ్చు. కంపెనీ పేరును దుర్వినియోగం చేయడానికి ప్రయత్నించే సదరు అనధికార వ్యక్తులతో వ్యవహరించేటప్పుడు జాగ్రత్త వహించాలని వినియోగదారులు మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది మరియు అతనితో ఎవరేని ఏవిధంగానైన వ్యవహరించినచో కంపెనీ బాధ్యత వహించదని తెలియచేయడమైనది.

మాజీ ఉద్యోగి వివరణ

వివరాలు	వివరాలు	ఫోటోగ్రాఫ్
పేరు	కార్తిక్ వడిచెర్ల	
తండ్రి పేరు	స్వర్గీయ వి.సత్యం	
చిరునామా	ఇ.నెం.15-10-290/2/1, శ్రీ సాయి ఆర్యవైశ్య మ్యారేజ్ లైన్ 88 ప్రక్కన, రామన్నపేట్, వరంగల్	
ప్రస్తుత ఎంప్లాయిమెంట్	ప్రస్తుతం, అతను TVS ADARSHA -ఆటో సర్వీస్ వరంగల్ వద్ద పని చేస్తున్నట్లు భావిస్తున్నాము.	

మత్తు రహిత సమాజ నిర్మాణం అందరి బాధ్యత

■ డీఆర్వో వైవీ గణేశ్

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో గణేశ్

హనుమకొండ, అక్టోబర్ 26 : మత్తు రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డీఆర్వో వైవీ గణేశ్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో సెంట్రల్ జోన్ డీసీపీ సలీమాతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు అలవాటు కాకుండా చూసుకోవడంలో తమ కుటుంబీకుల బాధ్యత కీలకమన్నారు. మత్తు పదార్థాలను అరికట్టడంలో పోలీసులదే ముఖ్య పాత్ర అని అన్నారు. ఎప్పటికప్పుడు ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాల యాజమాన్యంతో మాట్లాడి అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. డీసీపీ మాట్లాడుతూ.. వాహనాలను తనిఖీ చేసే కార్యక్రమం ముమ్మరం చేసి, విద్యాసంస్థల చుట్టుపక్కల పాన్ షాపులు, సిగరెట్ విక్రయ దుకాణాలు ఉండకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు. అనుమానాస్పదంగా వాహనాలు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా టోల్ ఫ్రీ 1908కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ఆర్డీవో నారాయణ, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు..

ఎల్కతుర్తి : యువత మత్తుకు బానిసకావొద్దని సీఐ పులి రమేశ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా దామెర గ్రామ పంచాయతీ కూడలి వద్ద పోలీసు జాగృతి కళాజాత బృందం ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, సైబర్ నేరాలు, అమ్మాయిల అక్రమ రవాణా, డయల్ 100, సీసీ కెమెరాల ఉపయోగాలు, మూఢ నమ్మకాలు, చెడు వ్యసనాలపై వివరించారు. హెడ్ కానిస్టేబుల్ విఠల్ పాల్గొన్నారు.

ముగ్గురు 'బంగారం' దొంగల అరెస్ట్

ముగ్గురు నిందితులను అరెస్ట్ చూపిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

సుబేదారి, అక్టోబర్ 26 : యజమాని గోల్డ్‌పై కన్నేసి మరో ఇద్దరితో కలిసి దోపిడీకి పాల్పడిన కారు డ్రైవర్ పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. శనివారం సుబేదారి పోలీసు స్టేషన్‌లో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. హనుమకొండకు చెందిన కీర్తి రవీందర్ వద్ద నర్సంపేటకు చెందిన బైరి రాము కారు డ్రైవర్‌గా చేరి, యజమాని ఒంటిపై ఉన్న బంగారు ఆభరాణాలను చోరీ చేయడానికి ప్లాన్ చేశాడు. రాము తన ఇద్దరు మిత్రులు నర్సంపేట మండలం రాజుపేటకు చెందిన రావుల అరుణ్‌కుమార్, నల్లబెల్లి మండలం మేడపల్లికి చెందిన ఓర్సు గణేశ్ పథకం రచించాడు. ఈ నెల 13న రాత్రి సమయంలో బాధితుడు రవీందర్, ప్రధాన నిందితుడు రాము న్యూశాయంపేట చెరువు కట్టపై కారులో ప్రయాణిస్తున్న సమయంలో రాము ఇచ్చిన సమాచారంతో మిగతా ఇద్దరు నిందితులు అక్కడి చేరుకొని రవీందర్‌ను కొట్టి, అతడి ఒంటిపై ఉన్న 31గ్రాముల బంగారం, సెల్‌ఫోన్, ప్రధాన నిందితుడు రాము ఒంటిపై ఉన్న రోల్డ్ గోల్డ్ దోపిడీ చేశారు. బాధితుడు రవీందర్ ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీసులు విచారణ చేసి కారు డ్రైవర్ రాము నిందితుడు అని గుర్తించి రాము, అరుణ్‌కుమార్, గణేశ్‌ను అరెస్ట్ చేశారు. రూ.1.08లక్షల నగదు, రోల్డ్ గోల్డ్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు.

'హింస రహిత సమాజం కోసం కృషి'

పరకాల, అక్టోబర్ 26 : హింస రహిత సమాజం కోసం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ పని చేస్తున్నదని సంస్థ కార్యదర్శి పల్లెపాడు దామోదర్ అన్నారు. పట్టణంలోని ఎఫ్‌జే ఫంక్షన్ హాల్‌లో లింగాధారిత హింసపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు, ఆడపిల్లలపై జరుగుతున్న హింసను నివారించడానికి గ్రామాల్లో మహిళా కమిటీల బలోపేతం తప్పనిసరి అని అన్నారు. జాతీయ నేర పరిశోధన సంస్థ గణాంకాల ప్రకారం ప్రతి ముగ్గురు మహిళల్లో ఇద్దరు హింసకు గురవుతున్నారన్నారు. డాక్టర్ స్వాతి, సంస్థ మేనేజర్ కవిరాజ్, బాధ్యులు రవీందర్, శ్రీలత, మండల సమాఖ్య అధ్యక్షురాలు రాధ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ క్రీడలు అవసరం

నిట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ రవికుమార్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 26 : ప్రస్తుత సమాజంలో క్రీడలు ప్రతి ఒక్కరికీ అవసరమని నిట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ రవికుమార్ అన్నారు. హనుమకొండలోని జేఎన్‌ఎస్‌లో అండర్-19 పోటీలకు డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్దఎత్తున అండర్-19 పోటీలను నిర్వహిస్తున్న ఆర్గనైజింగ్ సెక్రటరీ అశోక్‌కుమార్‌ను అభినందించారు. డీవైఎస్‌వో మాట్లాడుతూ.. ఈ నెల 29 వరకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఇప్పటివరకు 24 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించామని, 1200 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. నిట్ ఫిజికల్ డైరెక్టర్ హరి, రమణ, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సృజన్‌కాంత్, రవికుమార్, శ్యాంప్రసాద్, ప్రభాకర్‌గౌడ్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మొరం తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్

దామెర, అక్టోబర్ 26 : మండలంలోని ల్యాదెళ్ల రైతు గుట్ట నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీదేవి శనివారం తెలిపారు. గుట్ట నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్నారనే సమాచారం మేరకు అక్కడికి వెళ్లి నాలుగు ట్రాక్టర్లను గుర్తించి తహసీల్దార్ కార్యాలయానికి తరలించామన్నారు.

ఉచితంగా ఖరీదైన లేజర్ చికిత్స

పేద బాలుడి ప్రాణాలు కాపాడిన డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి

బాలుడితో డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 26 : నిరుపేద బాలుడికి ఖరీదైన లేజర్ చికిత్సను ఉచితంగా అందజేసినట్లు హనుమకొండలోని శ్రీనివాస కిడ్నీ సెంటర్ యూరాలజిస్ట్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం పుల్లూరు గ్రామానికి చెందిన సంధ్యా-శివ దంపతుల 14 నెలల బాబు మస్తా సుహాస్ ప్రిన్స్‌కు కిడ్నీలో 18 ఎంఎం రాయి ఉందని వైద్యులు నిర్ధారించారు. ఆ రాయిని కిడ్నీకి రంధ్రం కాకుండా చికిత్స చేయాలంటే రూ 3.50 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ విషయంలో నాలుగు ఐదు ఆసుపత్రులు తిరిగి తన వద్దకు వచ్చినట్లు రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. వారి ఆర్థిక పరిస్థితులనుచూసి అత్యంత అధునాతనమైన లేజర్ చికిత్సతో రాయిని ఉచితంగా తొలగించినట్లు చెప్పారు. ప్రస్తుతం బాబు ఆరోగ్యంగా ఉన్నాడని డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.

గైనకాలజిస్టులు మానసికంగా దృఢంగా ఉండాలి

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ కావ్య

మడికొండ, అక్టోబర్ 26 : గైనకాలజిస్టులు మానసికంగా దృఢంగా ఉండాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య సూచించారు. మడికొండలోని రెడ్డి కన్వెన్షన్‌లో అబ్‌స్టేట్రిక్స్, గైనకాలజీ తెలంగాణ చాప్టర్ 7వ వార్షిక రాష్ట్ర సదస్సు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 2 వేల మంది గైనకాలజిస్టులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మహిళలకు వివిధ దశల్లో వచ్చే అనారోగ్య సమస్యలను పేషెంట్స్‌కి అర్థమయ్యేలా వివరించాలన్నారు. రక్తహీనత, పౌష్టికాహార లోపం వంటి వాటితో పాటు క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు చేయాలన్నారు. కార్యక్రమంలో కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కర్ణాకర్‌రెడ్డి, వైద్యులు శాంతకుమారి, జామునాదేవి, నరసింహారెడ్డి, సంధ్యారాణి, మధుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రూ. 24.23 లక్షల విలువైన పటాకులు స్వాధీనం

హసన్‌పర్తి, అక్టోబర్ 26 : అక్రమంగా నిల్వ చేసిన రూ.24.23 లక్షల విలువైన పటాకులను పోలీసులు సీజ్ చేశారు. సీఐ చేరాలు కథనం ప్రకారం.. మండలంలోని అర్వపల్లికి చెందిన గుల్లపల్లి రాజు, గుల్లపల్లి రమేశ్ ఇళ్లల్లో పటాకులను అక్రమంగా నిల్వ చేశారనే సమాచారం మేరకు ఎస్సై దేవేందర్, పోలీస్ సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి తనిఖీ చేయగా రూ.24,23,400 విలువైన పటాకులు స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతుల సమస్యలు తీర్చేందుకే పాలంబాట

కమలాపూర్, అక్టోబర్ 26 : రైతుల సమస్యలు పరిష్కరించేందుకే పాలంబాట చేపట్టినట్లు ఎన్పీడీసీఎల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ వంశీ అన్నారు. శనివారం మండలంలోని పంగిడిపల్లిలో పొలాల వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడారు. వ్యవసాయానికి కరెంటు సరఫరాలో ఏమైనా అంతరాయం కల్గుతుందా? లోవోల్టేజీ సమస్య ఉందా? అని అడిగి తెలుసుకున్నారు. అసిస్టెంట్ ఇంజినీర్ సంపత్‌రెడ్డి, లైన్‌మెన్ రమేశ్ పాల్గొన్నారు.

'మెడికవర్'లో క్లిష్టమైన శస్త్రచికిత్స విజయవంతం

న్యూశాయంపేట, అక్టోబర్ 26 : హంటర్ రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో మొదటిసారిగా అత్యంత క్లిష్టమైన తవి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించామని హాస్పిటల్ గుండె వైద్య నిపుణుడు శరత్‌రెడ్డి వెల్లడించారు. శనివారం హాస్పిటల్లో ఆయన మాట్లాడుతూ.. కాజీపేట సిద్ధార్థనగర్‌కు చెందిన 77 సంవత్సరాల వయసు కలిగిన విద్యాసాగర్ కార్డియాక్ సింకోపితో బాధపడుతూ తమ ఆస్పత్రిలో చేరాడు. వైద్యులు శరత్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, సృజన్, అవనీష్ అతడికి వైద్యపరీక్షలు నిర్వహించి గుండె లయ సక్రమంగా లేకపోవడం, రక్తనాళాలు పూడుకుపోవడం, హార్ట్ వాల్వ్ అవరోధాలు వంటి సమస్యలను గుర్తించారు. రోగికి అత్యంత ఆధునిక పద్ధతుల్లో పీటీసీఏ, తవి రెండు ప్రొసీజర్స్‌ను ఒకేసారి విజయవంతంగా చేశామన్నారు. రోగి 45 రోజుల్లో సాధారణ స్థితికి చేరుకోవడం సంతోషాన్ని ఇస్తోందన్నారు.

విద్యాసాగర్‌తో కలిసి శస్త్ర చికిత్స వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

రైల్వే రిటైర్డ్ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

కాజీపేట, అక్టోబర్ 26 : రైల్వే రిటైర్డ్ పెన్షనర్ల దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆల్ ఇండియా రైల్వే రిటైర్డ్ అసోసియేషన్, రైల్వే పెన్షనర్ల బ్రాంచి అధ్యక్షుడు సంగమయ్య అన్నారు. కాజీపేటలోని రైల్వే పెన్షనర్ల కార్యాలయంలో శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ అభ్యర్థన మేరకు రైల్వే దవాఖానలో గైనకాలజస్ట్, కంటి వైద్యుడిని రైల్వే ఉన్నతాధికారులు నియమించారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కేవీ రావు, కోశాధికారి ఐలయ్య పాల్గొన్నారు.

పోరాడి హక్కులను సాధించుకుందాం

కాజీపేట, అక్టోబర్ 26 : లోకో రన్నింగ్ స్టాఫ్ హక్కులను పోరాడి సాధించుకుందామని ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఏఐఎల్ఆర్ఎస్ఏ) కేంద్ర ఉపాధ్యక్షుడు హనుమయ్య అన్నారు. కాజీపేట రైల్వేకమ్యూనిటీ హాల్‌లో సికింద్రాబాద్ రైల్వే డివిజన్ సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు ఏవీఎస్ఎన్ మూర్తి అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధునాతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో రైళ్ల వేగం పెరిగిందని, రన్నింగ్ స్టాఫ్‌కు పని గంటలు ఎక్కువైతే రైలు ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉంటుందన్నారు. సిబ్బందికి 46 గంటల వారాంతపు విశ్రాంతినివ్వాలని, గూడ్స్ రైలులో 8 గంటలు, కోచింగ్‌లో 6 గంటలకు డ్యూటీ చేసేందుకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. కేంద్రం రైల్వే ప్రైవేటీకరణను విరమించుకోవాలన్నారు. రన్నింగ్ స్టాఫ్ ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నూతన బ్రాంచి సెక్రటరీ అనిల్‌కుమార్, అసోసియేషన్ జోనల్ కార్యదర్శి సయ్యద్ జిలానీ, శ్రీజిత్, ఎంకే మూర్తి, గోవిందరాజ